ఇంటర్వ్యూ హిందుస్థాన్ మోటార్స్ ఎండీ, సీఈఓ ఉత్తమ్ బోస్

అంబాసిడర్ కారు గురించి ఇప్పుడు ప్రత్యేకంగా పరిచయం చేయనక్కర్లేదు. హిందుస్థాన్ మోటార్స్ తయారీయే ఈ కారు. 1948లో పుట్టిన ఈ ప్రఖ్యాత మోడల్ ఇప్పటికీ మన్ననలు అందుకుంటోంది. అప్పటి ప్రభ ఇప్పుడు లేనప్పటికీ క్యాబ్ సేవల్లో దీనికి సాటిలేదు. అందుకే త్వరలో అంబాసిడర్‌లో కొత్త వేరియంట్లను తీసుకురాబోతున్నామని చెబుతున్నారు హిందుస్థాన్ ఎండీ, సీఈఓ ఉత్తమ్ బోస్. వివిధ వాహన కంపెనీల్లో తనకున్న 26 ఏళ్ల అనుభవాన్ని రంగరించి అంబాసిడర్ విక్రయాలను పెంచడానికి ప్రయత్నిస్తున్నామని అంటున్నారు. 'ఈనాడు వాణిజ్య విభాగం'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివిధ అంశాలపై బోస్ ఏమంటున్నారంటే..

# కొత్త మోడళ్లు తెస్తాం

- విక్రయాలు పెంచుకుంటాం
- త్వరలో బీఎస్ IV అంబాసిడర్లు
- ఆంధ్రప్రదేశ్‌లో ప్లాంట్ యోచన లేదు
- అధిక వడ్డీ రేట్లు పరిశ్రమకు ఇబ్బందే



ఈనాడు వాణిజ్య విభాగం

**? అంబాసిడర్ విక్రయాలు పెంచుకోవడానికి మీవద్ద ఉన్న ప్రణాళికలు..**

సరళమైన డిజైన్, గట్టితనం, సౌకర్యవంతంగా ఉండడం, మన రోడ్లకు సరిగ్గా సరిపోవడం, తక్కువ ధరతో నిర్వహణ వంటి అంశాలు మా అంబాసిడర్‌కు పెద్ద ఆస్తిగా చెప్పుకోవచ్చు. అందుకే క్యాబ్ యజమానులకు ఇది చాలా ఇష్టం. ఇక ట్యాక్సీ విభాగంలోనూ అంబాసిడర్‌కు మంచి స్థానం ఉంది. వచ్చే కొద్ది నెలల్లో బీఎస్ IV ప్రమాణాలకు అనుగుణంగా డీజిల్ అంబాసిడర్‌ను విడుదల చేయడం ద్వారా ట్యాక్సీ మార్కెట్‌ను విస్తరించనున్నాం. కొన్నేళ్లుగా మాకు ఆంధ్రప్రదేశ్ మంచి మార్కెట్‌గా ఉంది.

**? మిత్సుబిషి మోటార్ కార్పొరేషన్‌తో కలిసి మీ సంస్థ లాన్సర్, పజెరో సెడియా, మాంటెరో, అవుట్‌లాండర్, లాన్సర్, ఎవల్యూషన్ ఎక్స్ వంటి వాటిని విడుదల చేసింది. మరిన్ని మోడళ్లను తీసుకొచ్చే ప్రతిపాదనలు ఏమైనా ఉన్నాయా..**

మా చెన్నై వ్యాపార యూనిట్లో పై ఉత్పత్తుల తయారీ, అసెంబ్లింగ్, మార్కెటింగ్ జరుగుతోంది. ఈ శ్రేణిలో పజెరో స్పోర్ట్స్‌ను గత మార్చిలో విడుదల చేశాం. దీనికి మంచి స్పందన ఉంది. వేచిచూసే గడువు కూడా పెరుగుతోంది. అక్టోబరు నుంచి ఈ వాహనం సులువుగా లభ్యమయ్యేలా చర్యలు తీసుకున్నాం. ప్రస్తుతానికి కొత్త మిత్సుబిషి వాహనాలను తీసుకురావాలని అనుకోవట్లేదు. కానీ పశ్చిమ బెంగాల్‌లోని మా ఉత్తర్పర ప్లాంట్‌లో తయారు చేస్తున్న అంబాసిడర్, ఇతర మోడళ్లలో కొత్త ఉత్పత్తులు రానున్నాయి. త్వరలో అంబాసిడర్ కొత్త వేరియంట్‌ను విడుదల చేయనున్నాం. విడుదల తేదీన దాని వివరాలు వెల్లడిస్తాం.

**? బీఎస్ III ఉద్గార నిబంధనలు పాటించే వాహనాల విక్రయాలకు మరో ఆరు నెలల వరకూ ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ అవకాశాన్ని మీరెలా సద్వినియోగం చేసుకోదలచారు. ట్యాక్సీ విభాగం కోసం బీఎస్ 4 డీజిల్ ఇంజిన్లను ఎపుడు తీసుకురానున్నారు.**

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ నిర్ణయాన్ని కోల్‌కతా క్యాబ్ యజమానులు స్వాగతించారు. ఎందుకంటే వారంతా అంబాసిడర్, హెచ్ఎమ్‌కు అభిమానులు. ఈ ఆరు నెలల్లో మేం 3000 వరకు 1.5 లీటర్ల డీజిల్ అంబాసిడర్లను విక్రయిస్తామని ఆశిస్తున్నాం. అంతక్రితమే చెప్పినట్లు మేం వచ్చే కొద్ది నెలల్లో అందరు వినియోగదార్లకు, ట్యాక్సీ యజమానులకు బీఎస్ IV వాహనాలను అందుబాటులోకి తెస్తాం.

**? గత ఆర్థిక సంవత్సరం కంపెనీ విక్రయాలు దిగజారాయి. రూ.29.96 కోట్ల నష్టం కూడా వచ్చింది. లాభాల బాటలో పయనించడానికి మీ దగ్గరున్న ప్రణాళికలేమిటి.**

అంబాసిడర్‌లో కొత్త వేరియంట్లపై మేం దృష్టి సారిస్తున్నాం. తేలిక పాటి వాహనాలు(ఎల్‌సీవీ) మా విక్రయాలకు చేదోడుగా ఉంటాయి. బీఎస్ IV డీజిల్ అంబాసిడర్లు 13 మెట్రో నగరాల్లో మా మార్కెట్‌ను మరింత విస్తరిస్తాయి. మా దగ్గరున్న కొన్ని వినూత్న ఆలోచనలు సైతం వచ్చే కొద్ది నెలల్లో మాకు ఫలితాలను అందిస్తాయి. వనరుల సద్వినియోగం, వ్యయ నియంత్రణ, వేల్యూ ఇంజినీరింగ్ మాకు కీలకంగా మారనున్నాయి.

**? భారత్‌లో ఏవైనా అదనపు ప్లాంట్ల ఏర్పాటు ఆలోచన ఉందా? ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో..**

ప్రస్తుతం హిందుస్థాన్ మోటార్స్‌కున్న ఉత్తర్పర(పశ్చిమ బెంగాల్), తిరువళ్లూర్(తమిళ నాడు), పితాంపూర్(మధ్య ప్రదేశ్) ప్లాంట్లతో మాత్రమే కొనసాగాలని భావిస్తున్నాం.

**? పి. చిదంబరం మూడోసారి ఆర్థికమంత్రిగా మూడోసారి బాధ్యతలు చేపట్టారు. సంస్కరణలనూ చేపట్టారు. వాహన రంగంతో పాటు మొత్తం ఆర్థిక వ్యవస్థలో ఏవైనా మార్పులు వస్తాయని భావిస్తున్నారా...**

కొత్త ఆర్థిక మంత్రి కొన్ని సంస్కరణలను ప్రకటించారు. వ్యాపార విశ్వాసం మెరుగైంది. అయితే అది ఎక్కువగా స్టాక్ మార్కెట్లలో ప్రతిఫలించింది. ఆర్థిక మందగమనం దేశంలోనూ, బయటా కొనసాగుతోంది. ద్రవ్యోల్బణం బాగా పెరిగింది. భారత్‌లో 70 శాతం వాహన విక్రయాలు రుణాల ద్వారా జరుగుతాయన్న విషయం తెలిసిందే. అయినా వడ్డీ రేట్లు చాలా ఎక్కువగా ఉన్నాయి. వాహనదారులు ఎక్కువగా వాడే డీజిల్ ధరలను ఇటీవలే పెంచారు. ఇవన్నీ వాహన పరిశ్రమ వృద్ధి, విక్రయాల మీద ప్రభావం చూపుతాయి. సంస్కరణలు భారీ స్థాయిలో, అది కూడా వేగంగా చేపట్టాల్సిన అవసరం ఉంది.